నేటి శుభోదయ
ఆదివారం | హైదరాబాద్
09 - 08 - 2026
www.netisubhodaya.com


# ప్రజా అవసరాలే లక్ష్యంగా
## సొంత నిధులతో అభివృద్ధి పనులు

- నల్లూరి హైట్స్‌లో 200 మీటర్ల సీసీ రోడ్డు ప్రారంభం.. మొక్కలు నాటిన శశిధర్ రెడ్డి దంపతులు
- ప్రజా సేవలో శశిధర్ రెడ్డి ముందడుగు అభినందనీయం - కాటా శ్రీనివాస్ గౌడ్





**పటాన్ చేరు, ఆగస్టు 08, నేటి శుభోదయ :** ప్రజా అవసరాలను గుర్తించి మౌలిక వసతుల కల్పనతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ సేవా కార్యక్రమాలు చేపడుతున్న అమీన్పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి సేవలను పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ అభినందించారు. బీరంగూడ డివిజన్ పరిధిలోని నల్లూరి హైట్స్‌లో శశిధర్ రెడ్డి, ఆయన సతీమణి మాజీ కౌన్సిలర్ లావణ్య శశిధర్ రెడ్డి సొంత నిధులతో నిర్మించిన సుమారు 200 మీటర్ల సీసీ రోడ్డును కాటా శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు.అనంతరం కాలనీలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు సందేశాన్ని ఇచ్చారు. అభివృద్ధి పనులతో పాటు పచ్చదనం పెంపొందించేందుకు మొక్కలు నాటడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నల్లూరి హైట్స్ కాలనీ వాసులు కాటా శ్రీనివాస్ గౌడ్, శశిధర్ రెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు.ప్రజా సేవలో శశిధర్ రెడ్డి ముందడుగు ఈ సందర్భంగా కాటా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారంలో శశిధర్ రెడ్డి ముందుండటం అభినందనీయమన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కోసం సొంత నిధులను వెచ్చిస్తూ అభివృద్ధి పనులు చేపట్టడం సంతోషకరమన్నారు. ఒకవైపు రోడ్లు వంటి మౌలిక వసతులు కల్పిస్తూ, మరోవైపు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయడం మంచి ఆలోచన అన్నారు.పదవులు, రాజకీయాలకు అతీతంగా ప్రజా సేవే లక్ష్యంగా శశిధర్ రెడ్డి పనిచేస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులో ఆయన మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని, భగవంతుడు ఆయన్ను ఆశీర్వదించాలని ఆకాంక్షించారు.ప్రజల అవసరాలు గుర్తించి.. పరిష్కారమే లక్ష్యంశశిధర్ రెడ్డి మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో ప్రజలకు ఎలాంటి అవసరాలు ఉన్నా వాటిని గుర్తించి పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ నిధులతో పరిష్కరించాల్సిన సమస్యలను పరిష్కరించడంతో పాటు, అత్యవసరమైన చోట తన సొంత నిధులతో పనులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే తన లక్ష్యమన్నారు.ప్రజలకు అవసరమైన మౌలిక వసతులతో పాటు పచ్చదనం పెంచేందుకు కూడా ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. నల్లూరి హైట్స్‌లో సీసీ రోడ్డు నిర్మాణంతో పాటు మొక్కలు నాటడం ద్వారా కాలనీలో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడేందుకు కృషి చేశామని చెప్పారు.కాటా శ్రీనివాస్ గౌడ్ సహకారం, ప్రజల ఆశీర్వాదంతో రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి, సేవా కార్యక్రమాలు చేపడతానని శశిధర్ రెడ్డి తెలిపారు. ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణ తనపై మరింత బాధ్యతను పెంచుతోందన్నారు.

### అభినందించిన కాలనీవాసులు

తమ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి సొంత నిధులు వెచ్చించడంతో పాటు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇచ్చిన శశిధర్ రెడ్డి, లావణ్య శశిధర్ రెడ్డి దంపతులకు నల్లూరి హైట్స్ వాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని పరిష్కరించేందుకు ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధా శ్రీనివాస్ గౌడ్, ఆత్మ కమిటీ సభ్యులు ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సీనియర్ నాయకులు, నల్లూరి హైట్స్ కాలనీ వాసులు, వివిధ కాలనీల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వార్త కాదు, ఊహించని వింతే వార్త"
## అనే దానికి ఈ ఉచిత దృశ్యం సరైన ఉదాహరణగా నిలుస్తుంది



**సంగారెడ్డి, ఆగస్టు 08, నేటి శుభోదయ :** సాధారణంగా పాము కప్పను వేటాడుతుంది. కానీ ఈ ఘటనలో పాము తనపైకి రాగా కప్ప ఎదురు తిరిగి దాడి చేసింది. కప్ప నుంచి తప్పించుకోవడానికి పాము చివరకు తోకముడిచి పారిపోవాల్సి వచ్చింది. సోషల్ మీడియాలో వైరల్ ఇది ఎక్కడ జరిగిందో స్పష్టమైన వివరాలు లేనప్పటికీ, నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటూ ఫేస్బుక్ ఇంస్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో బాగా ట్రెండ్ అవుతోంది. జర్నలిజం సూత్రంలో చిన్న దిద్దుబాటు కథనంలో పేర్కొన్న జర్నలిజం నానుడి సాధారణంగా కుక్క మనిషిని కరిస్తే వార్త కాదు. మనిషి కుక్కను కరిస్తేనే వార్త అని ఉంటుంది. అలాగే పాము కప్పను తింటే వార్త కాదు. కప్పే పామును మింగితే వార్త అనే వింత సంఘటనల కోవలోనికే ఈ వీడియో కూడా వస్తుంది. ప్రకృతి విరుద్ధంగా, బలహీనమైన జీవి బలమైన జీవిపై తిరగబడినప్పుడు "కథ అడ్డం తిరిగింది" అనడానికి ఇది ఒక ఆసక్తికరమైన ఉదాహరణ.

# విద్యార్థుల సర్టిఫికెట్లు బందీనా..?

- ఫీజు బకాయిల పేరుతో విద్యార్థి భవిష్యత్తుతో చెలగాటం చట్టవిరుద్ధం
- వికారాబాద్ లోని మహావీర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కళాశాలకు హైకోర్టు గట్టి చురకలు
- బకాయిలుంటే చట్టపరంగా వసూలు చేసుకోవాలి. సర్టిఫికెట్లు మాత్రం వెంటనే ఇవ్వాల్సిందే.
- ఫీజు రికవరీ పేరుతో విద్యార్థుల సర్టిఫికెట్లు బందీ చేసే అధికారం ఎవరికి లేదు
- హైకోర్టు తీర్పుతో ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు




**హైదరాబాద్, ఆగస్టు 08, నేటి శుభోదయ :** ఫీజు బకాయిల పేరుతో విద్యార్థుల సర్టిఫికెట్లను కాలేజీల్లో బందీగా పెట్టుకోవడం ఇక చెల్లదని హైకోర్టు స్పష్టం చేసింది. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయలేదన్న కారణంతో విద్యార్థి సమర్పించిన విద్యా ధ్రువపత్రాలను తన వద్దే ఉంచుకోవడం చట్టవిరుద్ధమని హైకోర్టు తేల్చి చెప్పింది. ఫీజు బకాయిలు ఉంటే వాటిని చట్టబద్ధమైన మార్గాల్లో వసూలు చేసుకోవాలని, విద్యార్థి సర్టిఫికెట్లను మాత్రం అడ్డుపెట్టుకోవద్దని హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. వికారాబాద్ లోని మహావీర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కళాశాలలో హైదరాబాద్ కు చెందిన డాక్టర్. అద్వైత బోక్రే తన అడ్మిషన్ సమయంలో సమర్పించిన సర్టిఫికెట్లను తిరిగి ఇవ్వాలని కోరినా కాలేజీ యాజమాన్యం నిరాకరించడంతో హైకోర్టును ఆశ్రయించారు. ఫీజు బకాయిలు చెల్లించే వరకు ధ్రువపత్రాలు ఇవ్వబోమంటూ కాలేజీ తీసుకున్న నిర్ణయాన్ని ఆయన సవాల్ చేశారు.పిటిషనర్ తరఫున హైకోర్టు సీనియర్ డెసిగ్నేటెడ్ కౌన్సిల్ బ్రహ్మదండి రమేష్ వాదనలు వినిపించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ జువ్వాడి శ్రీదేవి విచారణ చేపట్టి ఇటీవల తీర్పు వెలువరించారు.అడ్మిషన్ సమయంలో విద్యార్థి 10వ తరగతి మార్కుల జాబితా, ఇంటర్మీడియట్ మెమో, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్, ఇన్టెన్షిప్ కంప్లీషన్ ధ్రువపత్రాలు, జాబితాలను కాలేజీకి సమర్పించినట్లు కోర్టు గుర్తించింది.

### సర్టిఫికెట్లను అడ్డుపెట్టుకునే హక్కు ఎవరికి లేదు

ఫీజు బకాయిలు ఉన్నాయనే కారణంతో విద్యార్థి అసలు ధ్రువపత్రాలను నిలిపివేయడం సరైన పద్ధతి కాదని హైకోర్టు స్పష్టం చేసింది. బకాయిలు వసూలు చేసుకోవాలంటే కాలేజీ యాజమాన్యం చట్టబద్ధమైన మార్గాలను అనుసరించాల్సిందే తప్ప విద్యార్థి భవిష్యత్తును అడ్డుకునేలా సర్టిఫికెట్లను బందీగా పెట్టుకోవడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. తీర్పు ప్రతి అందిన వారంలోగా పిటిషనర్‌కు చెందిన అన్ని ధ్రువీకరణ పత్రాలను తిరిగి అందజేయాలని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీకి హైకోర్టు ఆదేశించింది.

### ఫీజు కోసం విద్యార్థుల భవిష్యత్తును బందీ చేయొద్దు

విద్యార్థి ఉన్నత విద్య, ఉద్యోగం, తదుపరి చదువులకు సర్టిఫికెట్లు కీలకం. అలాంటి ధ్రువపత్రాలను ఫీజు బకాయిల పేరుతో నిలిపివేయడం విద్యార్థి భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపే చర్యగా హైకోర్టు తాజా తీర్పు లో పేర్కొంది. ఈ తీర్పుతో విద్యాసంస్థలు విద్యార్థుల సర్టిఫికెట్లను బందీ చేసే విధానాలకు గట్టి హెచ్చరికగా మారింది. ఏ విద్యాసంస్థ అయిన విద్యార్థుల సర్టిఫికెట్లను బంధి చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హైకోర్టు తీర్పు పై ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# అంతర్జాతీయ వ్యవహారాలలో భారత్ స్వతంత్ర వైఖరిని కొనసాగించాలి

## - సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు

**హైదరాబాద్, ఆగస్టు 08, నేటి శుభోదయ :** దేశ స్వతంత్రత, సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడంతో పాటు అంతర్జాతీయ వ్యవహారాల్లో స్వతంత్ర వైఖరిని కొనసాగించాల్సిన అవసరం ఉందని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు పేర్కొన్నారు. భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం ( (ఇస్కఫ్) జాతీయ కార్యవర్గ సమావేశాల సందర్భంగా హైదరాబాద్, హిమాయత్ నగర్, అమృత ఎస్టేట్స్, ఇస్కఫ్ రాష్ట్ర కార్యాలయంలో శనివారం "ఇరాన్‌పై అమెరికా యుద్ధం – భారత్‌పై ప్రభావం" అనే అంశంపై ఇస్కఫ్ జాతీయ అధ్యక్షులు, మాజీ ఎంపీ సయ్యిద్ అజీజ్ పాషా అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సులో సయ్యిద్ అజీజ్ పాషా తోపాటు సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు, మాజీ ఎమ్మెల్సీ, ప్రో. కె. నాగేశ్వర్, మంగోలియా మాజీ భారత రాయబారి టి. సురేష్, ఇస్కఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్ పదిహరి, రాష్ట్ర అధ్యక్షులు కాడారు ప్రభాకర్ రావు, ప్రధాన కార్యదర్శి ఆర్. గోపాల్, ఉపాధ్యక్షులు పి.వి. దుర్గ ప్రసాద్, కోశాధికారి ఏ. విజయలక్ష్మి , హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు కె. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ భారతదేశ విదేశాంగ విధానంలో ఒకప్పుడు కీలకంగా ఉన్న నాన్ అలియెన్డ్ మూవ్మెంట్ (అలీన) విధానాన్ని పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని అన్నారు. నెహ్రూ హయాంలో భారత్ అనుసరించిన అలీన విధానం అనంతర కాలంలో విస్మరణకు గురైందని ఆయన అన్నారు. ప్రస్తుతం దేశంలో ఫాసిస్టు భావజాలానికి సంబంధించిన అనేక విధానాలు అమలవుతున్నాయని ఆరోపించారు. మతం, దేశం, జాతి పేర్లతో ప్రజలను విభజించే ధోరణులు పెరుగుతున్నాయని విమర్శించారు. హిందుత్వ పేరుతో సాగుతున్న రాజకీయాలు ఒక రకమైన జాతి దురహంకారానికి దారితీస్తున్నాయని అన్నారు. అమెరికా తన ఆధిపత్యాన్ని ప్రపంచవ్యాప్తంగా విస్తరించేందుకు ప్రయత్నిస్తోందని, భారత విదేశాంగ విధానంలోనూ అమెరికాతో సంబంధాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని కూనంనేని సాంబశివరావు విమర్శించారు. డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా భారత విద్యార్థులను చేతులకు సంకెళ్లు వేసి భారత్ పంపిన ఘటనలను ఆయన ప్రస్తావించారు. ఇలాంటి సందర్భాల్లోనూ కేంద్ర ప్రభుత్వం అమెరికా వైఖరిని గట్టిగా ప్రశ్నించకపోవడం ఆందోళనకరమన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సమాజం, దేశ ప్రయోజనాల కోసం ఇస్కాఫ్ వంటి ప్రజా సంఘాలు ప్రజల గొంతుకగా నిలవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఇస్కాఫ్ చారిత్రక నేపథ్యం ఉందని, భారతదేశంలోని అనేక ప్రజా సంస్థల భావజాలంపై వామపక్ష ఉద్యమం ప్రభావం ఉందని పేర్కొన్నారు. సమాజంలోని అట్టడుగు వర్గాలు, సామాన్య ప్రజల సమస్యలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు ప్రజాస్వామ్య, లౌకిక, సామాజిక న్యాయం, సార్వభౌమత్వ విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఇస్కాఫ్ మరింత చురుకుగా పనిచేయాలని కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ మాట్లాడుతూ పశ్చిమాసియాలో మారుతున్న రాజకీయ, భద్రతా పరిణామాల నేపథ్యంలో భారతదేశం తన జాతీయ ప్రయోజనాలను కాపాడుకునేలా సమతుల్యమైన, స్వతంత్ర విదేశాంగ విధానాన్ని కొనసాగించాలని సూచించారు. భారత్ ఆర్థిక, ఇంధన, భద్రతా ప్రయోజనాలకు పశ్చిమాసియా అత్యంత కీలకమైన ప్రాంతమని ఆయన పేర్కొన్నారు. పశ్చిమాసియాలో సుమారు కోటి మంది భారతీయులు వివిధ రంగాల్లో పనిచేస్తున్నారని, వారు భారత్ పంపుతున్న రెమిటెన్సులు దేశ ఆర్థిక వ్యవస్థకు ముఖ్యమైన మద్దతుగా నిలుస్తున్నాయని అన్నారు. 1991లో భారత్ తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొన్న సమయంలో గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న భారతీయులు పంపిన నగదు దేశానికి ఎంతో ఉపయోగపడిందని గుర్తుచేశారు. భారత్ ఇంధన అవసరాలకు పశ్చిమాసియా ఎంతో కీలకమని ఆయన అన్నారు. చమురు, ఎల్ సహజవాయువు వంటి ఇంధన వనరుల దిగుమతుల్లో ఈ ప్రాంతం ప్రధాన పాత్ర పోషిస్తోందన్నారు. అమెరికా, ఇజ్రాయెల్ వ్యూహాత్మక సంబంధాల నేపథ్యంలో భారత్ తన సంప్రదాయ విదేశాంగ విధానంలోని వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని కోల్పోతోందనే ఆందోళన వ్యక్తం చేశారు. ఇరాన్ చోటుచేసుకున్న పరిణామాలు, సైనిక దాడుల విషయంలో భారత్ స్పందించిన తీరుపై ప్రశ్నలు లేవనెత్తారు. గతంలో అంతర్జాతీయ సంక్షోభాల విషయంలో భారత్ వ్యవహరించిన విధానంతో పోలిస్తే ఇరాన్ విషయంలో భిన్నమైన వైఖరి కనిపించిందని ఆయన అభిప్రాయపడ్డారు. బ్రిక్స్ వంటి అంతర్జాతీయ వేదికల్లో భారత్ తన స్వతంత్ర వైఖరిని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని నాగేశ్వర్ రావు అన్నారు. అమెరికా ఒత్తిళ్ల కారణంగా కొన్ని సందర్భాల్లో భారత్ తన స్వతంత్ర దౌత్య వైఖరిని పూర్తిస్థాయిలో ప్రదర్శించలేకపోతోందనే అభిప్రాయాలు ఉన్నాయని పేర్కొన్నారు. అజీజ్ పాషా మాట్లాడుతూ ఇతర దేశాలతో సాంస్కృతిక, సామాజిక సంబంధాలను బలోపేతం చేయడం, వివిధ దేశాల కళలు, సాహిత్యం మరియు సాంస్కృతిక విలువలను పరస్పరం పంచుకోవడం, ప్రపంచ శాంతి, సద్భావన మరియు సమైక్యత కోసం ప్రజలను ఐక్యం చేయడమే 'ఇండియన్ సొసైటీ ఫర్ కల్చరల్ కో-ఆపరేషన్ అండ్ ఫ్రెండ్‌షిప్' (ఇస్కఫ్) లక్ష్యం అని తెలిపారు. విజయ్ కుమార్ పదిహరి మాట్లాడుతూ 1944లో ముంబైలో ప్రారంభమైన ఇస్కఫ్ అనేది భారతదేశం మరియు ఇతర దేశాల మధ్య సాంస్కృతిక బంధాలను, స్నేహ భావాన్ని పెంపొందించడానికి ఏర్పడిన ప్రముఖ ప్రజా సంఘం అని తెలిపారు.

